చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సమాజంలో నెలకొన్న సామాజిక అసమానతలు తొలగించడానికి న్యాయస్థానాలు కృషి చేస్తున్నందున చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చట్టాలు సమాన హక్కులు, అవకాశాలు కల్పించినా అసమానతలు తప్పడం లేదన్నారు. మానవ విలువలు తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పట్నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎండలు సుర సుర... మీటరు గిరగిరా

- ఉమ్మడి జిల్లాలో 4 మిలియన్ విద్యుత్ యూనిట్లు అదనపు వాడకం
- రోజుకు 21మిలియన యూనిట్లకుపైగా వినియోగం
- పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ఎండలు సుర్రు మంటున్నాయి. విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో విద్యుత్ మీటరు గిరగిరా తిరుగుతున్నాయి. పెరిగిన విద్యుత్ వినియోగానికి అనుగుణంగా కేటాయింపులు లేకపోవడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. మరికొన్ని చోట్ల అప్రకటిత విద్యుత్ కోతలు అమలవుతున్నాయి. సరఫరాలో అంతరాయాలకు సాంకేతిక సమస్యలే కారణమని, ఆ సమస్యలను త్వరిత గతిన పరిష్కరించి సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ అధికారులు చెప్పుకొస్తున్నారు. జిల్లాలో రోజువారీగా విద్యుత వినియోగం 21మిలియన యూనిట్లకు పైగానే ఉంటోంది. అయితే కేటాయింపులు మాత్రం 20 మిలియన్ యూనిట్లే ఉంటోంది.

జిల్లా వ్యాప్తంగా పెరిగిన వినియోగం

ఉమ్మడి జిల్లాలో 19.16 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 16.23 లక్షల గృహ కనెక్షన్లు ఉన్నాయి. వీటితోపాటు, వాణిజ్యం, పరిశ్రమలు, తాగునీటి కనెక్షన్లు, వీధిలైట్లు తదితర కనెక్షన్లు 3.07 లక్షలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం రోజువారీగా 20 మిలియన యూనిట్ల విద్యుత వినియోగం జరుగుతోంది. ఫిబ్రవరి నెలలో 17 నుంచి 18 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. మార్చిలో 19 నుంచి 20 మిలియన్ యూనిట్ల మధ్య వినియోగం జరిగింది. తాజాగా ఏప్రిల్‌లో 20 మిలియన్ యూనిట్ల నుంచి 21 మిలియన్ యూనిట్లకు పెరిగింది. గడిచిన మూడు నెలల్లో సరాసరి నాలుగు వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగినట్లు అధికారులు గణాంకాలు చెప్తున్నాయి. . సాధారణంగా ఎండాకాలంలో విద్యుత కేటాయింపులు కొంత ఎక్కువగానే ఉండాలి. అయితే వేసవి కాలంలో సాగు విస్తీర్ణం తగ్గుతుందన్న నెపంతో కేటాయింపులు తగ్గించినట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది.

అప్రకటిత కోతలు షురూ

జిల్లాలో విద్యుత్ వినియోగం కంటే కేటాయింపులు తక్కువగా ఉండటంతో ఇటు గృహాలకు..అటు వ్యవసాయానికి సరఫరా అయ్యే విద్యుతలో కోతలు పడుతున్నాయి. వ్యవసాయాకి రెండు విడతలో 9గంటల విద్యుత సరఫరా చేయాల్సి ఉండగా.. సరాసరిన అర గంట నుంచి గంట సమయం వివిధ సాకుల పేరుతో కోత పెడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. దీనికి తోడు కరెంటు ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో రైతులు పడిపోయారు. ఇక పట్టణాలు, పల్లెల్లో గృహాలకు సంబంధించి అనధికారికంగానే కోతలు అమలు అవుతున్నాయి. దీంతో వినియోగదారులు కరెంటు కష్టాలు తప్పడం లేదు. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. అప్రకటిన విద్యుత్ కోతలను నిలిపేయాలని వేడుకుంటున్నారు.

ఏదొక సమయంలో విద్యుత్ నిలిచిపోతుంది

రోజులో ఏదొక సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. గంట నుంచి గంటన్నర పాటు విద్యుత్ ఉండట్లేదని, దీంతో ఇంట్లో చిన్నారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒకపక్క వేడి, మరో పక్క ఉక్కపోతల నేపథ్యంలో విద్యుత్ కోతలతో కంటిపై కునుకు ఉండట్లేదు.

- యు.సూర్యావతి, రాజమహేంద్రవరం

అప్రకటిత విద్యుత్ కోతలు తగవు

ఎలాంటి ముందస్తు ప్రకటనలు లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నారు. ఫలితంగా నానా ఇబ్బందులు పడుతున్నాము. ముందగానే ప్రకటిస్తే ఆ మేరకు సన్నద్ధం అయ్యే అవకాశం ఉంటుంది. మిక్సీలు, గ్రైండర్లు, వాషింగ్ మిషన్లు పనిచేయకపోవడంతో రోజువారీ పనులకు ఆటంకం కలుగుతుంది.

- ఎంఎస్‌వి.లక్ష్మీ, ఆదర్శ్‌నగర్, రాజమహేంద్రవరం

అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా

వేసవి నేపథ్యంలో జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగింది. గతేడాది వినియోగాన్ని అంచనా వేసుకుని ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. ఆ మేరకు అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచాం. ఎక్కడైనా ఫీజులు పోయి ఇబ్బందులు తలెత్తితే వెంటనే పరిష్కరించేందుకు సిబ్బందిని షిఫ్టుల వారీగా 24 గంటలు అందుబాటులో ఉంచాము. అంతరయాలు లేకుండా విద్యుత్ సరఫరా అందజేస్తున్నాం.

– తిలక్ ఎస్ఇ విద్యుత్ శాఖ తూర్పుగోదావరి జిల్లా

ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న శేష బాబ్జి

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్లను రద్దు చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికులకైనా కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని ఉపాధి హామీ చట్టం రక్షణకై మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు శేషబాబ్జి పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల భవనంలో ఆశా వర్కర్ల సంఘం మండల కార్యదర్శి నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సదస్సులో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌లో భాగంగా ప్రభుత్వం తక్కువ కాలపరిమితి ఉద్యోగాలు కల్పన విధానం తీసుకొస్తుందని, దీనివల్ల కార్మికులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో కలిపి సమాన వేతనం ఇవ్వాలని ఉన్న జిఒను లేబర్ కోడ్‌లో భాగంగా రద్దు చేయనున్నారని, ఈ విధానం వల్ల ఎటువంటి నోటీసు ఇవ్వకుండానే ఉద్యోగం నుంచి తొలగిస్తారని తెలిపారు. ఎక్స్‌గ్రేషియా, గ్రాడ్యుటీ వంటి సదుపాయాల కల్పనకు, పలు డిమాండ్ల సాధనకు కార్మికులంతా ఐక్యం అవ్వాలని తెలిపారు. ఈ మేరకు ఏప్రిల్ 12న ఢిల్లీలో జాతీయస్థాయి సమావేశం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం మే 20న జరిగే సమ్మెలో వివిధ సంఘాల నాయకులను ఐక్యం చేయడానికి కృషి చేయాలని తెలిపారు. అనంతలక్ష్మి, పార్వతి, కళావతి, టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, అదృష్టదీపుడు, గోడి భాస్కరరావు, ఆశ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

'ఉపాధి'ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాలి

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధి హామీ పనులను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ డైరెక్టర్ జి.శ్రీకాంత్ అన్నారు. శనివారం కొండవరంలో సామాజిక తనిఖీ బందం ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్ కమ్యూనికేషన్ ద్వారా గ్రామస్థాయిలో ఉపాధి వేతనదారులకు ఉపాధి హామీ పథకం యొక్క హక్కులు, సౌకర్యాల గురించి రాజీ లేని అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కలిపేందుకు ఉపాధి కూలీలు, గ్రామ పెద్దలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి పనులు 100 రోజులు పూర్తి చేసుకుని వారి జీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. సామాజిక, వనరుల పటం ద్వారా ఏ పనులు నిర్వహించారు, మిగిలిన పనులు ఏమున్నాయనే దానిపై వివరించారు. పూడికతీత పనులను సామాజిక బృందం, పెద్దలు పనులు చేపట్టించి రూ.307 వేతనం వచ్చే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ డైరెక్టర్ జి.శ్రీకాంత్, స్టేట్ రిసోర్స్ పర్సన్స్ గౌరీశంకర్, సత్యనారాయణ, కోనయ్య పాల్గొన్నారు.

కిర్లంపూడిలో తల్లులకు వందనం చేస్తున్న బాలలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో 'అమ్మకు వందనం'

ప్రజాశక్తి - పెద్దాపురం, కిర్లంపూడి

పెద్దాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కాండ్రకోట అంగన్వాడీ సెక్టార్‌లో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం అమ్మకు వందనం కార్యక్రమం నిర్వహించినట్లు సెక్టార్ సూపర్వైజర్ ఉమాదేవి తెలిపారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ జి.ఉష ఆదేశాల మేరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో బాలలతో వారి మాతృమూర్తి కాళ్లు కడిగి పాద పూజ చేయించారన్నారు. ఇలా చేయటం వల్ల చిన్ననాటి నుంచి బాలలకు తల్లిదండ్రులపై గౌరవ భావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బాలల తల్లులు, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పాల్గొన్నారు.

కిర్లంపూడిలో అంగన్‌వాడీ సెంటర్లో తల్లికి వందనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని తల్లులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలతో తల్లులకు పాదాభివందనం కార్యక్రమం నిర్వహించారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల తల్లితండ్రుల పట్ల చిన్నతనం నుండి పిల్లలకు గౌరవభావం పెరుగుతుందని తెలిపారు. సిహెచ్.రత్నం, బి.సూర్యావతి, సిహెచ్.రాణి, పి.ప్రభావతి, పి.మంగయమ్మ, జి.గంగాభవాని, షేక్ హసీనా బేగం, ఎం.నూకరత్నం పాల్గొన్నారు.

చిన్నారుల సమ్మర్ క్యాంప్ ముగింపు

ప్రజాశక్తి - తాళ్లరేవు

బహుమతులు అందిస్తున్న జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్

చిల్డ్రన్స్ క్లబ్ తాళ్లరేవు ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్-2025 చిన్నారుల జోష్‌తో అదుర్స్ అనిపించింది. పది రోజులపాటు జరిగిన ఈ క్యాంపులో చిన్నారులు పలు అంశాలలో శిక్షణ పొందడంతో పాటు చిల్డ్రన్స్ క్లబ్ నిర్వహించిన పలు పోటీలలో ప్రతిభను కనబరిచారు. శనివారం జరిగిన సమ్మర్ క్యాంపు ముగింపు సభలో చిన్నారులకు వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, క్రాఫ్ట్, మ్యూజికల్ చైర్స్, క్రికెట్, కోకో, కబడ్డీ వంటి ఆటలలో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధి గుత్తుల మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జెడ్‌పిటిసి దొమ్మేటి సామ్యూల్ సాగర్, ముమ్మిడివరం ఎఎంసి మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, తాళ్ళరేవు సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీ దేవి మాట్లాడారు. ప్రతిభ చాటిన చిన్నారులకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్నారులు కేరింతలతో ఆయా చిన్నారుల తల్లిదండ్రులు ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు జయశ్రీ, భారతి, అద్దేపల్లి సత్తిరాజు, లయన్స్ క్లబ్ ప్రతినిధి నరేంద్ర రెడ్డి, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు తాతారావు, చెక్క త్రిమూర్తులు, గోపి , ఆంగ్ల ఉపాధ్యాయులు జగన్నాథరాజు, మాజీ సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి అత్తిలి బాబూరావు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, ఎండియుడబ్ల్యూఏ అధ్యక్షుడు వెంకటరమణ, ప్రజా సంఘాల నాయకులు ఈశ్వరరావు, రాజబాబు, అదృష్టదీపుడు, వీరబాబు, చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు పాలిక శ్రీనివాస్, వెదురుపావులూరి నాని, చిట్టితల్లి, అనంతలక్ష్మి, కె.ఆనంద కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

4వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సుంకర నాగేశ్వరరావు, కెవి.రమణ, బి.భద్రరావు, .జి.సతీష్, జి.నాగేశ్వరరావు, వి.భాస్కర్, ఎస్.సత్తి రాజు, డి.రాజు, పి.శ్రీను పాల్గొన్నారు.

ఆదిత్యలో ఎన్‌సిసి శిక్షణా శిబిరం ముగింపు

ప్రజాశక్తి-గండేపల్లి

ఎన్‌సిసి శిక్షణా శిబిరంలో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్స్

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో 3వ ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ హెచ్ఎస్.మాణిక్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి ఒకటో కంబైన్డ్ వార్షిక శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కల్నల్ హెచ్ఎస్.మాణిక్ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సామాజిక సేవ, శారీరక దఢత్వాన్ని పెంపొందించుకోవడానికి ఎన్‌సిసి క్యాంపులు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ శిబిరంలో కాకినాడ, ఈస్ట్ గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వచ్చిన దాదాపు 550 మంది ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారని తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఆయుధ విడిభాగాలను జోడించడం, విడదీయడం, ఫైరింగ్ వంటివాటిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. దీంతోపాటు రహదారి భద్రత, సైబర్ సెక్యూరిటీపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ హెచ్‌క్యూ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, గ్రూప్ కమాండర్, క్యాంపు కమాండెంట్ కల్నల్ హెచ్ఎస్.మాణిక్, ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. క్యాంపులో ప్రతిభ కనబరచిన క్యాడెట్స్‌కు బహుమతులు అందజేశారు.

కోరమాండల్ ఆధ్వర్యంలో సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సరుకులు పంపిణీ చేస్తున్న కోరమాండల్ సభ్యులు

రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమాండల్ మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ కోశాధికారి శ్రీదేవి మాట్లాడుతూ తమ సంఘ అధ్యక్షురాలు వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రతి నెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ పుణ్య కర్మల ద్వారా పవిత్రతను పొందడానికి గాను ప్రతి ఒక్కరూ సమాజ సేవకు అంకితం కావాలన్నారు. ఫలితం మీద లేనిపోని ఆశలు, ఊహలు పెంచుకోకుండా త్రికరణ శుద్ధిగా మంచి పనులు చేస్తే సత్ఫలితం తప్పక లభిస్తుందని కృష్ణమోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతి, మాధవీలత, పద్మ, దీపిక, అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ఓం నమ్మశివాయ, కుమార యాదవ్, రేలింగి బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'

మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-గండేపల్లి

కుట్టు శిక్షణను ప్రారంభించిన జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ

మాజీ సిఎం టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ మహిళల సంక్షేమ కోసం ఆనాడు పెద్దపేట వేసారని జగ్గంపేట ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ అన్నారు. అదే బాటలో ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళలకు ఆర్థికంగా ఎదుగుదలకు ప్రోత్సహించే విధంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు. గండేపల్లిలో బిసి కార్పొరేషన్ నిధుల ద్వారా ప్రతి మహిళ కుట్టు మిషన్ల ద్వారా శిక్షణ పొంది తమ ఆర్థిక పురోగతిని పెంచుకునే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారికి సుమారు రూ.15 వేల విలువైన కుట్టుమిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎపిఐఐసి చైర్మన్ ఉండి మాజీ ఎంఎల్‌ఎ మంతెన రామరాజు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుట్టు మిషన్ల ద్వారా మహిళలు అభివృద్ధి చెందాలని, దానికి తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. జగ్గంపేటలో ఏర్పాటు చేసే ఇండస్ట్రీలో మహిళలందరూ ఒక ప్రత్యేకమైన దుస్తులు తయారు చేసే కేంద్రం పెట్టుకోవచ్చని దానికి రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండ కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం కుట్టుమిషన్ల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్ రావు, జెడ్‌పిటిసి సభ్యుడు పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు, మాజీ సొసైటీ అధ్యక్షుడు పరిమిబాబు, ఎంపిపి చల్లగళ్ల దొరబాబు, కందుల చిట్టిబాబు, వెలమాటి కాశి, సుంకవల్లి రమేష్, బొల్లంరెడ్డి రామకృష్ణ, కాటేపల్లి భద్రం, తెలగారెడ్డి భద్రరావు, వెంపాటి రాజు, అడబాల ఆంజనేయులు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ చంద్రరావు, ఎపిఎం సన్యాసిరావు, ఆయా గ్రామ నాయకులు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణను నిరసిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి-పిఠాపురం

ర్యాలీ నిర్వహిస్తున్న మాల మహానాడు నేతలు

ఎపి మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పివి.రావు 73వ జయంతి సందర్భంగా స్థానిక సూర్యారాయ విద్యానంద గ్రంథా లయంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా వెంకట్రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేసి సుప్రీంకోర్టులో విజయం సాధించిన పివి రావు మహా నాయకుడన్నారు. రాజ్యాంగ రక్షకుడుగా అసలైన అంబేద్కర్ వాదిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఎస్‌సి వర్గీకరణ చేసుకోవచ్చని, క్రిమిలేయర్ వర్తింపజేసేందుకు సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అధికారాన్ని కల్పిస్తూ ఇచ్చిన తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని చెప్పారు. ఇది రిజర్వేషన్లను తొలగించే కుట్రలో భాగమే అన్నారు. ఎస్‌సి వర్గీకరణకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయ పార్టీలనూ రాబోయే ఎన్నికలలో ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దడాల సత్తిబాబు, కండెల్లి వీరబాబు, మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ యడ్ల లక్ష్మీపతి, ముంజవరపు కృపానందం, వడ్డి ప్రవీణ్, రవి, దాట్ల సూరిబాబు, బోయి నాగేశ్వరరావు, దాసరి అమత్ కుమార్, కృష్ణ, వరలక్ష్మి, వినోద్, నాగరాజు, బుచ్చిరాజు, చిన్నరాజు బాబు, సూరిబాబు, కన్నారావు, రాజు, సింహాచలం, బాబూరావు, యేసు, శ్రీను, మహేష్, విక్టర్ పాల్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998, 99వ సంవత్సరం పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి హాజరయ్యారు పదో తరగతిలో విద్యాబోధనలు చేసిన ఉపాధ్యాయులు కామరాజు, నాగేశ్వరరావు, వీరభద్రరావు, పిఎన్‌వి.సత్యనారాయణ, సూర్రెడ్డి, శ్రీలక్ష్మి, రాంబాబు, ఉమామహేశ్వరరావును పూర్వ విద్యార్థులు సత్కరించి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు 26 ఏళ్ల తర్వాత పదో తరగతి వరకు చదువుకున్న పాఠశాలలో మళ్లీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉదని తెలిపారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నప్పటికీ ఒకే వేదిక పైకి రావడంతో వయసును మరిచి చిన్ననాటి ఆటపాటలను గుర్తు చేసుకుంటూ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోకా ప్రసాద్, అడపా కన్న కుమార్, సానా లక్ష్మణరావు, భుజంగరావు, అన్నపూర్ణ, సునీత పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

జాతీయ రహదారి 216 పై శనివారం టాటా ఏస్‌వాహనం ఢీ కొన్న ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగర పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి 216 పై కొండాలమ్మ చింత ప్రాంతంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యానాం నుంచి అమలాపురం వైపు పల్సర్ బైక్ పై వెళ్తున్న సవరపు నాగరాజు(28)ను ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగరాజు అక్కడకక్కడే మృతిచెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి బైక్, సెల్ ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించి మతుడు అల్లవరం మండలం కోడూరు పాడు కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతునికి భార్య రేణుక, కుమారుడు, కుమార్తె ఉన్నారని, మృతుడు ధాన్యం పట్టుబడులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటాడని సమాచారం. మృతదేహాన్ని శవ పంచానామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు.

కొండపైకి వెళ్తుండగా కారులో చెలరేగిన మంటలు

రత్నగిరిపై తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-శంఖవరం

అన్నవరం దేవస్థానం సత్యదేవుని దర్శనార్థం రత్నగిరి కొండపైకి కారులో వెళుతున్న యాత్రికులకు తృటిలో ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం దంపతులు ఇద్దరు పిల్లలతో కారులో కొండపైకి వెళుతుండగా కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. దీంతో కారులో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. కారు ఇంజన్ హీటెక్కడతో మంటలు రేగినట్టు తెలుస్తోంది.

శృంగార వల్లభునికి రూ 3.16 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీశృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.2,05,750, అన్నదానం విరాళాల ద్వారా రూ.76,031, కేశ ఖండన ద్వారా రూ.8,840, తులాభారం ద్వారా రూ.700, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.24,690 వెరసి రూ.3,16,011 ఆదాయం సమకూరుందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి నమోదు పత్రం అందిస్తున్న హెచ్‌ఎం

జోరుగా 'ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్'

ప్రజాశక్తి - సామర్లకోట

బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులను చేర్పించడం ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తోడ్పడాలని కోరుతూ హెచ్‌ఎం తోటకూర సాయి రామకష్ణ ఆధ్వర్యంలో శనివారం జోరుగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. తమ పాఠశాలలో అంకితభావంతో కూడిన ఉన్నత విద్యార్హతలు గల సిబ్బంది ఉన్నారని, పట్టణంలో అధిక ఉత్తీర్ణత శాతంతో పాటు మండల స్థాయి ప్రథమ స్థానంలో నిలిచిందని తెలుపుతూ ఇంటింట ప్రచారం చేశారు. ఈ ఏడాది తమ పాఠశాలలో వొకేషనల్, కంప్యూటర్ విద్యపై కూడా తర్ఫీదు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, యూనిఫారం, ఉచిత నోటు పుస్తకాలు, తల్లికి వందనం, స్కౌట్ అండ్ గైడ్స్ వంటి సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెవివి.సత్య నారాయణ, ఎఎల్‌వి.కుమారి తదితరులు ఉన్నారు.

10వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి -కరప

కరప గ్రామంలో కనకదుర్గాదేవి ఆలయంలో శనివారం 37వ విగ్రహ ప్రతిష్టా వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాదిమంది తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం 10,000 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మేడిశెట్టి అప్పలస్వామి, మేడిశెట్టి పెద్దకాపు, నక్కా నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం వరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

భూమిలో సారవంతాన్ని కాపాడుకోవడానికి ప్రకృతి సేద్యం ఒక వరం అని తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణస్వామి అన్నారు. ఏలేశ్వరంలో శనివారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా రైతు తక్కువ ఖర్చుకి పంటల పండించడంతోపాటు ప్రజలకు మంచి ఆరోగ్యం అందించిన వారు అవుతారని ఆయన తెలిపారు. ప్రతి రైతు ప్రకతి వ్యవసాయం విధిగా నిర్వహించాలని ఆయన కోరారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేశారు.

అన్నదాతల ఆశలు ఆవిరి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అకాల వర్షాల ప్రభావంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కళ్లాల్లో ధాన్యం తడిసిపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ప్రభుత్వం వైపు ఆశగా చూస్తున్నారు. ఈ రబీ సీజన్‌కు ప్రకృతి వైపరీత్యాలతో పాటు ప్రభుత్వ వైఫల్యాలు గుదిబండలా మారాయి. ఉమ్మడి జిల్లాలో 4.5 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరిగిన విషయం విధితమే. అక్షరాలా 16.06 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి రాగా ప్రభుత్వం కంటితుడుపుగా 7.50లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం తీసుకుంది. మరో వైపు కురుస్తున్న వర్షాలకు ఎక్కడికక్కడే వరిపైర్లు నేలవాలటంతో పాటు, ధాన్యం రాశులు, అరటి, కూరగాయలు తదితర ఉద్యాన పంటలకు సైతం నష్టం వాటిల్లింది. అయితే పభుత్వం సకాలంలో స్పందించి నిబంధనలను సడలిస్తే రైతులు వర్షాలకు ముందే ఒబ్బిడి చేసుకునే అవకాశం ఉన్నా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. తేమ శాతం పేరుతో తాత్సార్యం చేయటంతో రైతులు ఆరబెట్టేందుకు అవస్థలు తప్పలేదు. మరో వైపు తేమ సాకుతో వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలులో చిత్తశుద్ధితో వ్యవహరించాలని రైతన్నలు కోరుతున్నారు.

సమర శంఖారావం పూరిస్తున్న కార్మిక సంఘాలు

కేంద్ర కార్మిక సంఘాల పిలుపు నేపథ్యంలో కార్మిక లోకం కదం తొక్కుతోంది. పారిశ్రామిక రంగాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే కార్మికులు సైతం ఇప్పటికే సమ్మె నోటీసులను యాజమాన్యాలకు అందజేస్తున్నారు. ఈ నెల 20న సమ్మెకు పిలుపునిచ్చిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా మేడే పురస్కరించుకుని ర్యాలీలలో రైతులు, కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి తమన నిరసనను వ్యక్తం చేశారు. అదే స్ఫూర్తితో గత రెండు వారాలుగా విస్తృతంగా గేట్ మీటింగ్‌లు, సన్నాహక సమావేశాలు నిర్వహించి సమ్మె ఆవశ్యకతను వివరిస్తున్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్లకు ప్రోత్సాహకాల పేరుతో పెద్దఎత్తున రాయితీలు కల్పించిన విషయం విధితమే. అదే విధంగా ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటు సంస్థలకు కారుచౌకగా కట్టబెట్టడంతో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కరువవుతోంది. పోరాడి సాధించుకున్న లేబర్ కోడ్లు రద్దు చేసి యాజమాన్యాలకు అనుకూల విధానాలను అమలు చేసేందుకు యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలు ఐక్యమత్యంగా తమ నిసరన తెలియజేసేందుకు సంసిద్ధమవుతున్నాయి.

ఉపాధి కూలీలకు వేతన వెతలు

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితి కారణం. కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విధితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. రెండేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్రమ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయిలు పెట్టడం పరిపాటిగా మారింది. తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

వేట సాగక పూట గడవక

వేట నిషేదం నేపథ్యంలో మత్స్యకారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏప్రిల్ 14 నుంచి వేట నిషేదం అమలులోకి వచ్చిన విషయం విధితమే. జూన్ 15 వరకూ వేట నిషేదం అమలు తప్పనిసరి. మత్స్యకారులకు గతంలో బియ్యం, కూరగాయలతో పాటు, పప్పు దినుసులు, అపరాలతో పాటు ఆర్థిక సహాయం అందజేసేవారు. గత కొన్నేళ్లుగా కేవలం ఆర్థిక సాయానికే పరిమితం చేసిన విషయం విధితమే. అయితే నెల రోజులు గడిచినా ఇప్పటికీ ప్రభుత్వ సాయం అందలేదు. దీంతో మత్స్యకారుల కుటుంబాల పరస్థితిదయనీయంగా మారింది. జిల్లాలో 3.55 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈరంగానికి అనుబంధంగా మరో 50 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ఉపాధి లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం నిబంధనల పేరుతో మత్సకార భరోసా అందించటం విమర్శలకు దారి తీస్తోంది. అర్హులైన వారందరినీ ఆదుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

యానాం వార్తలు

రేషన్ కార్డుల మార్పు కోసం ప్రత్యేక కమిటీ

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ పరిధిలో పసుపురంగు రేషన్ కార్డు (ఎపిఎల్) కార్డులను ఎరుపు రంగు రేషన్ కార్డు (బిపిఎల్)గా మార్చుకునేందుకు దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హులైన వారి కోసం ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలనకు ప్రత్యేక కమిటీని నియమించినట్టు ఆర్ఎఒ మునిస్వామి తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 22 రేషన్ దుకాణాలల్లో ఈ మార్పునకు అర్హులైన కుటుంబాలను గుర్తించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

ర్యాలీలో పాల్గొన్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

ఆపరేషన్ సిందూర్ ద్వారా వీరోచిత పోరాటం సాగిస్తున్న భారతసైన్యానికి సంఘీభావం తెలుపుతూ శనివారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యాన సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణలో అశువులు బాసిన సైనికులకు నివాళులర్పిస్తున్నామని, వారి త్యాగాలు చిరస్మరణీయమైనవని పేర్కొన్నారు. యుద్ధంలో ప్రతి ఒక్కరూ సైన్యానికి బాసటగా నిలవాల్సిన సమయమిదని పేర్కొన్నారు. అనంతరం వందలాదిమంది యువకులు, మహిళలు నినాదాల మధ్య బాలయోగి స్టేడియం నుంచి ప్రారంభమైన ర్యాలీ పాతబస్టాండ్, చిన్నాసెంటర్, విష్ణాలయం వీధి, ఆర్ఎఒ ఆఫీసు, పట్టణంలో పలు ప్రాంతాల మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్ అభిమానులు, కార్యకర్తలు

ఘనంగా ఎంఎల్ఎ అశోక్ పుట్టినరోజు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం ఆయన అభిమానులు, కార్యకర్తలు పలు గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎంఎలఎ కార్యాలయం వద్ద అభిమానులు భారీ కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుకున్నారు. అనంతరం స్వీట్స్ పంచారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద కనకాల రాజు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి ఎంఎల్ఎ అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల విద్యారంగంలో సమస్యలపై 12న ధర్నా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పాఠశాలల పునర్వవస్థీకరణ బదిలీలు, ఉపాధ్యాయుల ప్రమోషన్లకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ నెల 12న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ, ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు పరిష్కారం చేయాలని కోరినా నేటికీ పరిష్కారం జరుగలేదన్నారు. రోజుకొక ఆలోచనతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. బదిలీ నిబంధనలు సవరించాలని, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగు పడేలా ఉపాధ్యాయుల కేటాయింపు ఉండాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి 1:20 మాత్రమే ఉండాలన్నారు. హై స్కూల్లో 45 మంది విద్యార్థులకు ఒక సెక్షన్ ఇవ్వాలని, సమాంతర మీడియం కొనసాగించాలి, యుపి పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు ఉండాలని, మున్సిపల్స్ హై స్కూల్స్‌లోని పోస్టులన్నీ అప్‌గ్రేడ్ చేసి వెంటనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు. బదిలీలు ప్రమోషన్లకు సంబంధించి జిఒలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి వారికి నోటీసు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శి కెవిఎస్.ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-కాకినాడ

భారత్-పాకిస్తాన్ సరిహద్దులో పాకిస్తాన్ సైన్యం జరిపిన దాడిలో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాలోని గోరంట్లకు చెందిన జవాన్ మురళీనాయక్‌కి ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయంలో శనివారం ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ అనుచరులు మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లు దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. మురళీనాయక్ చేసిన త్యాగం మరిచిపోలేని ఘట్టమని, ఆయన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. మురళీ నాయక్ త్యాగానికి పుష్పాంజలి సమర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయన సాహసం, వీరత్వాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాస్, ఆఫీస్ ఇన్‌ఛార్జి మేకా లక్ష్మణమూర్తి, న్యూటన్ ఆనంద్, గింజాల శ్రీనివాస్, చింతపల్లి అర్జున్, బండి నరేంద్ర, ముత్యాల అనిల్, యాళ్ల చక్రవర్తి, బర్ల శ్రీనివాస్, సూరిబాబు, కళ్యాణి రమేష్, రవి, నాని వాసు, వంశీ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్ దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లు ఎంతో గర్వకారణమని వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. మురళీనాయక్ చేసిన త్యాగం భారతజాతి మరిచిపోదని, ప్రభుత్వం దేశం కోసం ప్రాణాలర్పించిన జవాన్ల త్యాగానికి గుర్తుగా వారి వారి స్వస్థలాలలో వారి విగ్రహాలను ఏర్పాటు చేసి వారిని గౌరవించాలని పేర్కొన్నారు. మురళీ నాయక్ కుటుంబానికి ఆమె తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తుని

తుని పట్టణంలో పాత గ్రంథాలయ భవనంలో మహిళల కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఎంఎల్ఎ యనమల దివ్య శనివారం ప్రారంభించారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంస్థ ఆధ్వర్యంలో మహిళలను పారిశ్రామికంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి, కూటమి నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

'మదర్' ఆధ్వర్యంలో మెగా వైద్య క్యాంప్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

మదర్స్ డే సందర్భంగా రాజమహేంద్రవరంలోని జెఎన్ రోడ్డులో ఉన్న మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యజమాన్యం మహిళలకు సంబంధించిన అన్ని రకాల వ్యాధులకు మే 11 నుంచి 31 వరకు ఉచితంగా వైద్యసేవలు అందించనున్నారు. డాక్టర్ బి.హిమజారెడ్డి వైద్య సేవలు అందిస్తారు, అవసరమైన వారికి సర్జరీలు ఉచితంగా చేయనున్నట్టు తెలిపారు. సాధారణ కాన్పు, నొప్పి లేకుండా ఆపరేషన్లు, గర్భసంచి తొలగింపు, పిల్లలు పుట్టకుండా ఆపరేషన్, అండశయంలో కణితుల తొలగింపు, రక్తహీనత, రక్తస్రావం ఎక్కువ అవ్వడం, ఉమ్మనీరు తగ్గిపోవడం, బిడ్డ బరువు తక్కువగా ఉండటం, అన్ని రకాల గర్భకోస వ్యాధులు, ఇన్ ఫెర్టిలిటీకేసులు, పొత్తికడుపులో నొప్పి, పీరియడ్స్ ఇబ్బందులు, పిసిఒ సమస్యలు, థైరాయిడ్ సమస్యలు, ట్యూబ్‌లో ప్రెగ్నెన్సీ తొలగింపు, తెల్ల బట్ట, అండాశయంలో సమస్యలు, థైరాయిడ్ సమస్యలు వంటి వాటికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మదర్ హాస్పిటల్ వైద్యులు హిమజరెడ్డి తెలిపారు.

ప్రమాదకరంగా డ్రెయినేజీ స్లాబ్

ప్రజాశక్తి-కడియం

మండలంలోని వేమగిరి గ్రామంలోని కొత్తపేట ప్రాంతం, పోతురాజు నగర్‌లోని డ్రెయినేజీపై ఉన్న స్లాబ్ శిథిలమై ప్రమాదకరంగా మారింది. గ్రామంలోని నాలుగు అంతర్గత రోడ్లు కలిసే ఈ ప్రాంతంలో మధ్యన డ్రెయినేజీ ఉంది. దానిపై ఉన్న స్లాబ్ కొన్ని నెలలుగా పగిలి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. పంచాయతీ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి చేతులు దులిపేసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో గ్రావెల్ లారీలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేవి, స్థానికులు అడ్డుకోవడంతో వీటిని ప్రస్తుతం నిలిపేశారు. ప్రస్తుతం అధికలోడుతో నర్సరీలకు సంబందించిన భారీ వాహనాలు తిరుగుతున్నాయని, దీంతో డ్రెయినేజీపై స్లాబ్ రోజురోజుకూ కుంగిపోతోందని స్థానికులు తెలిపారు. రోజూ వందలాది మంది తిరిగే ఈ రోడ్డులో ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

అర్హత కలిగి ఉండి రేషన్ కార్డులు లేని వారు ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌ఛార్జి సివిల్ సప్లయిస్ డిటి దివాకర్ తెలిపారు. కొత్త రేషన్ కార్డులు కావాలనుకునే వారితో పాటు పాత కార్డుల్లో కొత్త పేర్లు చేర్పు, మార్పుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలంలోని కాటవరం వద్దగల బొబ్బిలంక ఇసుక ర్యాంపు నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా, 200పైగా యంత్రాలతో ఇసుకను తవ్వేసి అక్రమంగా రవాణా చేస్తున్నారని వారుత ఎలిపారు. రాత్రి వేళల్లో బిల్లులు లేకుండా ఇసుక రవాణా జరుగుతోందని, దీనిపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. ఇసుక ర్యాంపుల నిర్వహణలో కూలీలతో లోడింగ్ చేయాలనే నిబంధనలు ఉన్నా ఇక్కడ అమలు కావట్లేదన్నారు. యంత్రాలతో లోడింగ్ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ర్యాంపు నిర్వాహకులను వివరణ కోరగా అంతా పక్కాగా కూలీలతోనే లోడింగ్ చేయిస్తున్నామని, ఎలాంటి యంత్రాలు ఉపయోగించడం లేదని చెబుతున్నారు.

బాల బాలాజీ ఆదాయం రూ.4.06 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానమునకు శనివారం వివిధ విభాగాల ద్వారా4,06,417రూ లు ఆదాయం సమకూరిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు తెలిపారు ఇందులో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్ కు 21,217రూ లు ఆదాయం రాగా, నిత్యాన్నదాన ట్రస్ట్ కు 1,01,381రూ లు ఆదాయం వచ్చిందన్నారు 5,500 మంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకోగా 3,200 మంది భక్తులు అన్న ప్రసాదము స్వీకరించారన్నారు.

ధాన్యం సేకరణ లక్ష్యం పెంపు

ప్రజాశక్తి - నిడదవోలు

మండలంలో ధాన్యం సేకరణ లక్ష్యం పెంచామని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నిడదవోలు మండలం శెట్టిపేటలో అదనంగా 400 మెట్రిక్ టన్నులు, సమిశ్రగూడెంలో 300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన అధికారులను ఆదేశాశించారు. ఈ విషయమై అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి దుర్గేష్ వెంటనే ధాన్యం సేకరణ లక్ష్యం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం సేకరణలో ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అన్నదాతల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు.

స్పీడ్ బ్రేకర్‌తో ప్రమాదాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని ప్రక్కిలంక ఏటుగట్టుపై ప్రమాదాల నివారణకు అధికారులు వేయించిన స్పీడ్ బ్రేకర్ ఇప్పుడు ప్రమాదకరంగా మారింది. ఈ స్పీడ్ బ్రేకర్ వేసిన ప్రదేశంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో లైట్లు లేక స్పీడ్ బ్రేకర్లు కానరావడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని గాదేలపాలెం గ్రామానికి చెందిన దేశాల తులసికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.48,300 చెక్కును టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శనివారం అందించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా వైద్యం చేయించుకున్న వారు ఎంఎల్ఎ సిఫార్సు లెటర్‌లో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌కుమార్, టిడిపి క్రిస్టియన్ విభాగం జిల్లా అధ్యక్షులు కన్నబాబు, టిడిపి మండల అధ్యక్షులు మంగరౌతు రామకృష్ణ, భూపతిపాలెం స్కూల్ చైర్మన్ గల్లా రామచంద్రరావు పాల్గొన్నారు.

శ్మశానాన్ని అభివృద్ధి చేయాలని వినతి

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం గ్రామంలో క్రిస్టియన్స్, దళిత, బిసిలకు చెందిన శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని శనివారం జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్మశానం ఇప్పటికే నిండిపోయిందన్నారు. మరో చోట 5 ఎకరాలు భూమి కేటాయించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న శ్మశానం నీటితో నిండి అందులో చెత్త, చెదారం నిల్వ ఉండటంతో అంత్యక్రియల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే దాన్ని మట్టితో నింపాలన్నారు. శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ, మూడు వైపులా గేట్లు నిర్మించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నెహ్రూ మాట్లాడుతూ ఈ సమస్యలపై తక్షణమే దృష్టి సారిస్తానన్నారు. మట్టి ఫిల్లింగ్, ప్రహరీ నిర్మాణానికి హామీ ఇచ్చారు. చుట్టు పక్కల ప్రదేశాలలో ప్రభుత్వ భూమి ఉంటే శ్మశానానికి కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో క్రిస్టియన్, దళిత, బిసి, ఒసి నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయపద్రానికి పిలుపు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కేంద్ర, రాష్ట్రాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఎస్తేర్ రాణి పిలుపునిచ్చారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానికఅంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశ వర్కర్ల సమావేశం జి.బేబీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్తేర్ రాణి మాట్లాడుతూ కేంద్రం అమలు చేస్తున్న లేబర్ కోడ్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, కార్మిక, ఉద్యోగుల ఐక్యత వర్ధిల్లాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుభాషిణి, జి దుర్గా ప్రసాద్, లతో పాటు ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తైక్వాండో ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టంలోని స్థానిక భాష్యం పాఠశాలలో ఆదివారం 3వ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా తైక్వాండో ఓపెన్ ఛాంపియన్‌సిప్-2025 నిర్వహించనునట్టు నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్ సబ్ జూనియర్, కాడెట్, సీనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని బాల బాలికలు పోటీల్లో పాల్గొవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 9989001162లో సంప్రదించాలన్నారు.

క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-శంకవరం

యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని, తద్వారా వారిలో శారీరిక శ్రమ పెరిగి ఆరోగ్యం మెరుగు పడుతుందని అన్నవరం దేవస్థానం చైర్మన్ రాజా ఐవి రోహిత్ అన్నారు. శనివారం సత్యదేవ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఐవి రామ్ కుమార్ మెమోరియల్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ఐవి.రోహిత్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి పేరున మెమోరియల్ స్థాపించడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. ఏటా ఈ మెమోరియల్ ద్వారా వివిధ సామాజిక సేవలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

హెల్మెట్ తప్పని సరి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జి.శ్రీనివాసరావు వాహనదారులకు సూచించారు. శనివారం మండలంలోని పాలంగి ప్రధాన రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ ధరించని, వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు లేని పలువురికి అపరాధ రుసుము విధించారు. సుమారు రూ.5 వేల వరకూ జరిమానా విధించామని ఎస్ఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పలు పనులకు ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లిలో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును శనివారం గోపాలపురం ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు శనివారం ప్రారంభించారు. దేవరపల్లిలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్లను ప్రారంభించారు. దేవరపల్లి హై స్కూల్లో ప్రీమియర్ లీగ్ క్రికెట్ ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి సువర్ణ రాజు, టిడిపి నాయకులు కొయ్యలమూడి చిన బాబు, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - నిడదవోలు

మండలంలోని మునిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన పోలేరమ్మ జాతరలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర కమిటీ ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది. ఆయన వెంట జుజ్జవరపు సత్యనారాయణ, మునిపల్లి సర్పంచ్ వెలగన నరేష్ తదితరులున్నారు.

CHANGE OF NAME

I, SATYAVARAPU RATNAMALA, W/o. Sambasivarao, D.No. 6-8-1, Nidamarthi vari Street, Rajahmundry (Urban), E.G. District, A.P., PIN: 533101, I have changed my name from **MAJETY RATNAMALA KRISHNA RAO** (Old Name) to **SATYAVARAPU RATNAMALA** (New Name). Henceforth Iam being called **SATYAVARAPU RATNAMALA,** W/o. Sambasivarao, for all purpose.

పాస్‌పోర్టు పడిపోయినది

తలారి ఆనందరావు, S/o. చిట్టోడు, డో.నెం. 1-180, అంబేద్కర్ నగర్, తిమ్మాపురం గ్రామం, కాకినాడ రూరల్, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 533005 అను పేరిట గల పాస్‌పోర్టు నెం. **S3916809,** తేది.07-9-2018 కలది మా ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తమై ది.వి. 01-5-2024 సం॥ తేదీన తిమ్మాపురం సెంటర్‌లో గల జిరాక్స్ షాప్‌నకు బైక్‌పై వెళ్ళుచుండగా దారిలో నా ఒరిజినల్ పాస్‌పోర్టు గల బ్యాగ్ పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో ఈక్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.

తలారి ఆనందరావు
సెల్: 9848351484